క్లుప్తంగా

దిల్‌రాజుకు మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: సినీ నిర్మాత దిల్‌రాజును హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. దిల్‌రాజు తండ్రి సుందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ వృద్ధాశ్రమంలో పట్టణానికి చెందిన అనుముల వెంకటరమణ జ్ఞాపకార్థం డాక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ్రమంలోని 40 మంది వృద్ధులకు చికిత్స అందించి మందులు ఉచితంగా అందజేశారు. శిబిరంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ అర్చన, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల అనురాధ, అప్పాల మంజుల, అప్పాల మహేశ్, అప్పాల ప్రభాకర్ పాల్గొన్నారు.

రాయితీ గొర్రెలు పంపిణీ

ఖానాపూర్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులకు రాయితీ గొర్రెలను పశువైద్యాధికారి దీప్తి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గతంలోనే లబ్ధిదారులు డీడీ చెల్లించగా ఈనెల 7, 8 తేదీల్లో వారికి మంజూరైనట్లు పేర్కొన్నారు.

పేదవిద్యార్థికి చేయూత



విద్యార్థితో వేదం పాఠశాల యాజమాన్యం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో లోకేశ్వరంకే చెందిన అశ్వంత్ కుమార్ నాలుగో తరగతి చదువుతున్నాడు. అశ్వంత్ తల్లి సునీత మూగ కాగా.. తండ్రి శ్రీనివాస్ ఇటీవల భగీరథ చెరువులో పడి మరణించాడు. పేద కుటుంబం కావడంతో అశ్వంత్‌కు ఉచితంగా చదువు చెబుతామని పాఠశాల యాజమాన్యం ముందుకొచ్చింది. బుధవారం విద్యార్థికి ఉచితంగా దుస్తులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు జక్కోల్ల రమేశ్, ఉపాధ్యాయుడు రవీందర్ ఉన్నారు.

'బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయండి'



మాట్లాడుతున్న నేతలు

లక్ష్మణచాంద: బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం, నర్సాపూర్, బాబాపూర్, కంజర్, తిర్పెల్లి, ధర్మారం తదితర గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపునకు తోడ్పాటు అందించాలని సూచించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై విమర్శలు



గోడ దుస్థితి చూపుతున్న ప్రజలు

ఖానాపూర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు పలు రాజకీయ పార్టీల వాల్‌రైటింగ్‌లను చెరిపేస్తున్న సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోడలపై ఉన్న రాతలను తొలగించేందుకు సిబ్బంది తెల్లరంగుకు బదులు నల్ల రంగువేసి పేర్లు, బొమ్మలు మాత్రమే కనిపించకుండా తుడుస్తున్నారు. దీంతో తమ ఇళ్ల గోడలు అందవికారంగా మారాయని పట్టణప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

లోకేశ్వరం: సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగించాలని భైంసా డిపో విలేజ్ అధికారి సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని పుస్పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అందిస్తున్న వివిధ రకాల సేవలు, బస్‌పాస్‌లను వివరించారు. శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు అద్దెబస్సులు దొరుకుతాయని పేర్కొన్నారు. ఆర్టీసీ వారు దసరా ధమాకా పేరిట లక్కీ డ్రా నిర్వహిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగెం నర్సయ్య, ఆరోగ్య కార్యకర్తలు అనిత, సునీత, వీడీసీ సభ్యులు ఉన్నారు.

'డబుల్' యోగం ఇప్పట్లో లేనట్లే?

- సందిగ్ధంలో భైంసాలో డబుల్‌బెడ్ రూం లబ్ధిదారుల పరిస్థితి
- లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసినా పంపిణీలో జాప్యం
- ఎన్నికల షెడ్యూల్ రావడంతో కేటాయింపు జరిగేనా?



భైంసాలోని డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయం

భైంసాటౌన్: ఇల్లు లేని పేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై భైంసాలో సందిగ్ధం నెలకొంది. ఇళ్ల నిర్మాణం పూర్తయినా, ఇప్పటికీ లబ్ధిదారులకు కేటాయించలేదు. పలుమార్లు వార్డుసభలు నిర్వహించి లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి పట్టాలు సైతం అందించారు. అయితే ఇప్పటికీ ఇళ్ల కేటాయించకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. దీంతో సొంతిల్లు కలగానే మిగిలిపోతోంది.

కాగా లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు ఉన్నారంటూ ఆరోపణలు రావడంతోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ నిలిచినట్లు పలువురు లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఇళ్ల పంపిణీ చేస్తారో లేదోనన్న సందేహాలు వారిలో వ్యక్తమవుతున్నాయి.

భైంసాలో ఇలా...

భైంసా పట్టణంలో మొత్తం 800 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, భైంసా–పార్డి(బి)మార్గంలో నిర్మించారు. మొదటివిడతలో 200 ఇళ్లు మంజూరవగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో మంజూరైన 440 ఇళ్లు కూడా నిర్మాణపనులు పూర్తిచేసుకున్నాయి. మరో 160 ఇళ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం గతేడాది డిసెంబర్ 5, 6, 7 తేదీల్లో వార్డుల వారీగా వార్డుసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. 6,805 దరఖాస్తులు రాగా 200 ఇళ్లలో ముంపు గ్రామం గుండెగాంవాసులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. వాటిని మినహాయించి పనులు పూర్తయిన 440 ఇళ్లకు మాత్రమే అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

దరఖాస్తులు భారీగా రావడంతో అర్హులైన వారి ఎంపిక కోసం రెండు సార్లు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. అనంతరం లక్కీడ్రా ద్వారా ఎంపికై లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఎంపిక ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా ఇళ్లు కేటాయించకపోవడంతో అయోమయం నెలకొంది.

'గెలిపించండి.. అభివృద్ధి చేస్తా'



మహిళలతో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

కడెం: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని అల్లంపల్లి, బాబానాయక్‌తండా గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మారుమూల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, స్టీఫెన్, లక్ష్మణ్, సర్దార్ తదితరులు ఉన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయండి

- డీఐఈవో జాదవ్ పరశురామ్



రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈవో పరశురామ్

దిలావర్‌పూర్: సకాలంలో సిలబస్ పూర్తి చేసి ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో జాదవ్ పరశురామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గదుల్లో విద్యార్థుల హాజరు, వారి ప్రగతి పరిశీలించారు. 75 శాతం హాజరు ఉంటేనే వార్షిక పరీక్షలకు అనుమతి ఉంటుందని.. దీనిపై విద్యార్థులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై బోధనాతీరు, సిలబస్, పరీక్షల ఫలితాల గురించి చర్చించారు. విద్యార్థులను నీట్, ఎంసెట్ పరీక్షలకు సన్నద్ధయ్యేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి'



ఖానాపూర్: ప్రచారం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని బావాపూర్(కె), బీర్నంది, రంగపేట, ఎర్వచింతల్ గ్రామాల్లో వారు గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతోపాటు డిక్లరేషన్, మ్యానిఫెస్టోను వివరించారు. దయానంద్, యూసుఫ్‌ఖాన్, జంగిలి శంకర్, అబ్దుల్ మజీద్, నిమ్మల రమేశ్, కడార్ల గంగనర్సయ్య, తోట సత్యం, భూక్య రాజు, కొడారి రవీందర్, బిక్కునాయక్, అంబాజీ, కొడారి నరేశ్, సుతారి వెంకటేశ్, అలిశెట్టి రాజు, రూప్‌సింగ్, ఫికర్‌సింగ్, సజ్జు, జహీర్‌అహ్మద్, లక్ష్మీపతిగౌడ్, లక్ష్మీరాజం, జహీర్, శంకర్ తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని తాండ్ర గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, అతిక్‌అహ్మద్, మంగ్యానాయక్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆ పార్టీ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని రేవోజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన రామన్న కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, గోవర్ధన్, రమేశ్, సతీశ్, అనిల్, గంగన్న, తిరుపతి, కొమురయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమనేతకు ఒక్క అవకాశం ఇవ్వండి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సోన్: కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

సోన్: తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన ఉద్యమనేతకు నిర్మల్ నియోజకవర్గ ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. వస్తున్నా మీ కోసం.. పల్లెపల్లెకూ పాదయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని న్యూవెల్మల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ గడ్డం స్వామి, వార్డు సభ్యులు జంగం చరణ్‌రాజ్, చింతకింది మంజుల, గంగాధర్, బొడ్డు లక్ష్మణ్‌తో పాటు 70 మంది బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇన్నేళ్లలో నిర్మల్‌కు మంత్రి చేసిదేమిటో చెప్పాలని శ్రీహరిరావు సవాల్ విసిరారు. మంత్రి ఐకేరెడ్డి ఒంటెద్దు పోకడలు, చేసిన భూకబ్జాలు, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని..ఈ సారి కమీషన్ల మంత్రిని ఇంటికి పంపుతారన్నారు. అనంతరం సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామంలో జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. నర్సారెడ్డి, అమృత్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో సోన్ మండలం మాదాపూర్ సర్పంచ్, నిర్మల్‌లోని చింతకుంటవాడకు చెందిన కడప గణేశ్‌తో పాటు పలువురు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి..

లక్ష్మణచాంద: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కూచాడి శ్రీహరిరావు కుమార్తె, సుప్రీంకోర్టు న్యాయవాది మాధురి అన్నారు. బుధవారం మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్వర్, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్, నగేష్, రవి, నారాయణ, వినేశ్, సురేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'లంబాడాలపై బీఆర్‌ఎస్ చిన్నచూపు'

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం లంబాడాల పట్ల చిన్నచూపు చూస్తోందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 40 నియోజకవర్గాల్లో ఎల్‌హెచ్‌పీఎస్ అభ్యర్థులను పోటీ చేయించి బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపడమే తమ ఎజెండా అని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ఉద్యమకారులతోపాటు గ్రూప్–1 అభ్యర్థులను పోటీలో ఉంచుతామని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేసి పోలీస్ రాజ్యంలో ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. బహుజన రాజ్య అధికారమే లక్ష్యంగా లంబాడాలు ఓటు ద్వారా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



నిర్మల్‌లోని ఎస్‌ఆర్‌ప్రైమ్ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు



భైంసాటౌన్ : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



జిల్లా కేంద్రంలోని బచ్పన్ పాఠశాలలో

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఆర్ ప్రైమ్, బచ్పన్ పాఠశాలల్లో విద్యార్థులు బతుకమ్మ ఆడిపాడారు. పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. ఎస్‌ఆర్ ప్రైమ్ పాఠశాల జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్, ప్రధానోపాధ్యాయులు రామ్‌దాస్, బచ్పన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అయ్యన్నగారి రచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కోలాటం ఆడుతూ బతుకమ్మ పాటలు పాడారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సర్వీస్ చేస్తామని అక్రమ వసూళ్లు

- నలుగురిని బంధించిన గ్రామస్తులు
- పెంబి మండలం మందపల్లిలో ఘటన



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పెంబి: ఖానాపూర్‌లో ఉన్న అమృత ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఐడీ కలిగిన నలుగురు ఇంటింటికీ వెళ్లి డబ్బులు వసూలు చేస్తుండటంతో గ్రామస్తులు నిర్బంధించిన ఘటన పెంబి మండలంలోని మందపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మందపల్లిలో ఎల్‌పీజీ ఇండేన్ గ్యాస్ సర్వీస్ చేస్తామని చెప్పి రూ.200 నుంచి రూ.400 వరకు మంగళవారం నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారంటూ గ్రామస్తులు బుధవారం పంచాయతీలో నిర్బంధించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ప్రశ్నించగా.. గ్యాస్ లీకేజీ అయి ప్రమాదం జరిగితే బీమా పరిహారం వస్తుందని సదరు వ్యక్తులు పేర్కొన్నారు. గ్రామంలో ఒకే చోట ఉండి గ్రామస్తులకు వివరించాలి కానీ ఇంటింటికీ వెళ్లడంతో చిన్నారులు, వృద్ధులు భయాందోళన చెందారని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో వసూలు చేసిన డబ్బులను వినియోగదారులకు తిరిగి ఇప్పించారు. ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇందులో రాజేశ్, విక్రం, మహేందర్, రాజబాబు, నవీన్, శంకర్, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఖానాపూర్: రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో.. కనీసం బదిలీ అయిన వారినైనా ప్రభుత్వం రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో మాట్లాడారు. ఉపాధ్యాయులు అవసరమైన చోట ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలతోనే బదిలీలు, పదోన్నతులు నిలిచి విద్యారంగంలో సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. అనిల్‌కుమార్, రాజు, సుచిత్ర ఉన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

లోకేశ్వరం: పద్మశాలీలు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం రాష్ట్ర సభ్యుడు, హైదరాబాద్‌లోని న్యాయవాది రావుల కేశవదాస్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్దుల్లాపూర్ మార్కండేయ ఆలయంలో పద్మశాలి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీటీసీ భోజారాం, గోవిందరాజు, దొంతుల గంగాధర్, నర్సయ్య, తులసి గంగాధర్, పుండలిక్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నర్సాపూర్ మండలం టెంబుర్ని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు సంగెం అశోక్, అల్లాడి బుక రవి, కడారి రాంచందర్, తొడిశెట్టి భూమేశ్, తొడిశెట్టి రాములు, కొబ్బి సాయినాథ్, యాటకారి రమేశ్, కడారి భూమేశ్ బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు ఏలేటికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, ఏలేటి శ్రీకాంత్‌రెడ్డి, మెంచు నరేశ్, మెంచు భార్గవ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులకు దుమ్ము కష్టాలు



లారీ వెనుక దట్టంగా అలుముకున్న దుమ్ము



ప్రమాదకరంగా కంకరతేలిన రోడ్డు

భైంసాటౌన్: భైంసా–బోధన్ 161(బీబీ) జాతీయ రహదారి నిర్మాణ పనులు ఆరేడు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. భైంసా పట్టణం నుంచి దేగాం వరకు రోడ్డుపై కంకర తేలి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నీళ్ల ట్యాంకర్‌తో క్యూరింగ్ చేయకపోవడంతో రోడ్డుపై దుమ్ము విపరీతంగా లేస్తోంది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు లేచే దట్టమైన దుమ్ముతో వెనుక వచ్చే ద్విచక్రవాహనదారులకు ఎదురుగా వచ్చేవారు కన్పించడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించి ఇబ్బందుల్లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కుభీర్: మండలంలోని బెల్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన రాఘవేంద్ర ఇటీవల ఖానాపూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసినందుకు బుధవారం పాఠశాలలో గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు రాఘవేంద్రను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మహేశ్, రాజేశ్వర్, గ్రామ పెద్దలు ధర్మన్న, గంగాధర్, సాయినాథ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ పదోన్నతిపై తానూరు మండలం బోరిగాం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందాడు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు విద్యాధర్, ఉపాధ్యాయులు దశరథ్, మల్లికార్జున్, శ్రీనివాస్, కృష్ణారావు, అరుణ, సుజాత తదితరులు ఉన్నారు.

రిలే నిరాహార దీక్షకు మద్దతు

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బురుగుల రాజు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజుకు చేరింది. మండలంలోని సుంక్లి గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ ఆయన దీక్ష చేపట్టగా బుధవారం బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుంక్లి గ్రామ పంచాయతీలో అక్రమ లేఅవుట్‌లకు అనుమతి, ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతిపై అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు గౌతం పింగ్లే, అనిల్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో భైంసాకు చెందిన మాచర్ల సురేశ్ మరణించగా అతడి భార్య స్వప్నకు రూ.20 లక్షల బీమా చెక్కును జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, రీజినల్ మేనేజర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ బుధవారం అందజేశారు. భైంసాశాఖ మేనేజర్ రవిశంకర్ మాట్లాడుతూ ఎస్‌బీఐ గంజ్ భైంసాశాఖలో సురేశ్ రూ.వెయ్యి విలువైన ప్రమాద బీమా తీసుకోవడంతో నామినీ అయిన తన భార్యకు చెక్కు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది దేవేంద్రజీ, నరేశ్, బాలకృష్ణ, గరూజీ రాథోడ్, సిబ్బంది దేవేందర్, రాజగౌడ్, సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.